క్లుప్తంగా

బీజేపీ వన్‌టౌన్ అధ్యక్షుడిగా గడ్డం మహేష్



నల్లగొండ టూటౌన్ : బీజేపీ నల్లగొండ పట్టణ వన్‌టౌన్ అధ్యక్షుడిగా గడ్డం మహేష్ నియమితులయ్యారు. ఈమేరకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నాగం వర్షిత్‌రెడ్డి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

నకిరేకల్ పట్టణ అధ్యక్షుడిగా మురళీమోహన్



నకిరేకల్ : బీజేపీ నకిరేకల్ పట్టణ అధ్యక్షుడిగా గర్రె మురళీమోహన్ నియమితులయ్యారు. ఈ మేరకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నాగం వర్షిత్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా కౌన్సిల్ మెంబర్‌గా నకిరేకల్‌కు చెందిన చినేని జాని నియమితులయ్యారు.

నార్కట్‌పల్లి అధ్యక్షుడిగా శ్రీనివాస్



నార్కట్‌పల్లి : బీజేపీ మండల అధ్యక్షుడిగా నార్కట్‌పల్లి మండల కేంద్రానికి చెందిన మేడబోయిన శ్రీనివాస్‌యాదవ్, జిల్లా కౌన్సిల్ మెంబర్‌గా మండల కేంద్రానికి చెందిన నడింపల్లి శ్రవణ్‌కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు.

మునుగోడు అధ్యక్షుడిగా జానయ్య



మునుగోడు: బీజేపీ మునుగోడు మండల అధ్యక్షుడిగా రెండోసారి చొల్లేడు గ్రామానికి చెందిన పెంబళ్ల జానయ్య నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్ రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు.

శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా ప్రదీప్‌రెడ్డి



నల్లగొండ టూటౌన్ : నీలగిరి మున్సిపాలిటీ శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా ప్రదీప్‌రెడ్డిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. భువనగిరి మున్సిపల్ కార్యాలయంలో హెల్త్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ప్రదీప్‌రెడ్డి పదోన్నతిపై నీలగిరి మున్సిపల్ కార్యాలయానికి బదిలీ చేసింది. గతంలో ప్రదీప్‌రెడ్డి నీలగిరి మున్సిపల్ కార్యాలయంలో హెల్త్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తించాడు.

ఇన్‌చార్జ్ కమిషనర్‌గా అబ్దుల్ రశీద్



నకిరేకల్ : మున్సిపల్ కమిషనర్ బాలయ్య పదవీ విరమణ చేశారు. కాగా నకిరేకల్ మున్సిపల్ మేనేజర్‌గా పనిచేస్తున్న అబ్దుల్ రశీద్‌కు ప్రభుత్వం ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించింది. శుక్రవారం అబ్దుల్ రశీద్ బాధ్యతలు స్వీకరించారు.

మునుగోడు ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా నరేష్



మునుగోడు: మునుగోడు తహసీల్దార్ ఎం.నరేందర్ కొండమల్లేపల్లి తహసీల్దార్‌గా బదిలీ అయ్యారు. శుక్రవారం ఆయన విధుల నుంచి రిలీవ్ కాగా ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా డిప్యూటీ తహసీల్దార్ ఎస్.నరేష్‌కు కలెక్టర్ బాధ్యతలు అప్పగించారు. నరేష్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. బదిలీపై వెళ్లిన తహసీల్దార్ ఎం.నరేందర్‌ను పలువురు మాజీ ప్రజాప్రతినిధులు సన్మానించారు

లిటిల్ సోల్జర్స్ ప్రతినిధులకు పురస్కారం



పురస్కారం అందుకుంటున్న బ్రహ్మదేవర నరేష్, కర్నాటి నరేష్

నకిరేకల్ : పట్టణానికి చెందిన లిటిల్ సోల్జర్స్ ఫౌండేషన్ ప్రతినిధులు బ్రహ్మదేవర నరేష్, కర్నాటి నరేష్ సేవా కార్యక్రమాల్లో యంగ్ ఇండియా–2025 పురస్కారం అందుకున్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని నాంపల్లి నెహ్రూ ఆడిటోరియంలో జరిగిన యంగ్ ఇండియా –2025 కార్యక్రమంలో సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ అశోక్‌రెడ్డి చేతులమీదుగా వారు పురస్కారాలు అందుకున్నారు. లిటిల్ సోల్జర్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏడాది కాలంగా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించినందుకు గాను వారికి పురస్కారాలు దక్కాయి.

కేబినెట్ నిర్ణయంపై హర్షం

నల్లగొండ టౌన్: కేంద్ర కేబినెట్ సమావేశంలో కుల గణన చేయాలని నిర్ణయం తీసుకోవడంపై హర్షం వ్యక్తం చేస్తూ బీసీ యువజన సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం నల్లగొండలో స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో బీసీ యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కట్టికోలు దీపెందర్ మాట్లాడారు. సమగ్ర కులగణన చేపట్టి దేశవ్యాప్తంగా బీసీ రిజర్వేషన్లను జనాభా దామాషా ప్రకారం పెంచాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీసీ యువజన సంఘం జిల్లా కార్యదర్శి ఎలిజాల వెంకటేశ్వర్లు, నియోజకవర్గ అధ్యక్షుడు బోళ్ల నాగరాజు, ఉపాధ్యక్షుడు వనం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో వసతులు ఏవీ ?



మర్రిగూడలో చెట్లకింద సేద తీరుతున్న రైతులు

- ఇబ్బందులు పడుతున్న రైతులు
- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న నిర్వాహకులు

మర్రిగూడ : ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కనీస మౌలిక సదుపాయాలు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొనుగోలు కేంద్రాల్లో నిర్వాహకులు రైతులకు, హమాలీలకు మౌలిక వసతులు కల్పించాల్సి ఉంటుంది. దీనికోసం ప్రభుత్వం ప్రత్యేక నిధులను వెచ్చిస్తోంది. అయినప్పటికీ కేంద్రాల నిర్వాహకులు రైతులకు వసతుల ఏర్పాటు కోసం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కేంద్రాల్లో తమ పంటను అమ్ముకునేందుకు వచ్చే రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

నాలుగు కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోళ్లు

ప్రస్తుతం యాసంగి సీజన్‌లో రైతులు పండించిన వరి పంటను అమ్ముకునేందుకు ప్రభుత్వం మర్రిగూడతోపాటు యరగండ్లపల్లి గ్రామంలో మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో, శివన్నగూడ, ఖుదాబాక్షపల్లిలో ఎఫ్‌ఎస్‌సీఎస్ (రైతు సేవా సహకార సంఘం) ఆధ్వర్యంలో మొత్తం 4 దొడ్డురకం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఆయా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోళ్లు ముమ్మరంగా కొనసాగుతున్నాయి.

నీడ కోసం చెట్లే దిక్కు..

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు కనీస మౌలిక సదుపాయాలైన తాగునీరు, టెంట్, మరుగుదొడ్ల సౌకర్యాలు కల్పించాలి. కేంద్రాల్లో తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేశారు కానీ ఇతర సౌకర్యాలు ఏర్పాటు చేయడంలో నిర్వాహకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పలువురు రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మర్రిగూడ, యరగండ్లపల్లి, ఖుదాబాక్షపల్లి గ్రామాల్లోని కేంద్రాల్లో చిన్నపాటి గుడిసె నిర్మించినప్పటికీ ఆ గుడిసెను నిర్వాహకులు, సిబ్బంది మాత్రమే వినియోగిస్తున్నారు. రైతులకు టెంట్లు ఏర్పాటు చేయకపోవడంతో సమీప చెట్ల కిందే సేదతీరాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. సంబంధిత అధికారులు, నిర్వాహకులు ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద మౌలిక వసతుల కల్పనకు చొరవ చూపాలని మహిళా రైతులు కోరుతున్నారు.

సౌకర్యాలు కల్పించాలి



కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం అమ్ముకోవడానికి వచ్చిన రైతులకు కనీస సౌకర్యాలు కల్పించాలి. ఎండలో ధాన్యాన్ని ఆరబెట్టిన తర్వాత రైతులు టెంటు లేకపోవడంతో చెట్ల కిందనే ఉండాల్సి వస్తోంది. ఎండలు విపరీతంగా ఉన్నాయి. చెట్ల కిందనే మధ్యాహ్నం భోజనం చేస్తున్నాం.

– మాడెం వెంకటమ్మ, యరగండ్లపల్లి

చెట్టు నీడే ఆధారం



మర్రిగూడ కొనుగోలు కేంద్రం వద్ద వేప చెట్టు నీడే మాకు ఆధారం. ఆ చెట్టు లేకపోతే నీడ కోసం తాటి చెట్ల వెంట నిల్చోవాల్సి వస్తోంది. కొంతమంది రైతులు ఇంటి నుంచే తాగునీరు తెచ్చుకుంటున్నారు. రైతుల కోసం ప్రభుత్వం వెచ్చించే నిధులతో సౌకర్యాలు కల్పించాలి.

– చిరగోని జంగయ్య, కొండూరు

నిర్వాహకులకు సూచించాం



ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా మౌలిక వసతుల కల్పించాలని నిర్వాహకులకు సూచించాం. మండలంలోని నాలుగు ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా సహించేది లేదు. వసతులు లేనిచోట తక్షణమే వసతులు కల్పించాలి.

– బక్క శ్రీనివాస్, తహసీల్దార్, మర్రిగూడ

ప్రతి ఉద్యోగి అంకితభావంతో పనిచేయాలి

- మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి

మునుగోడు: ప్రతి ఉద్యోగి తమ విధుల పట్ల అంకితభావంతో పనిచేయాలని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం నియోజకవర్గంలోని ఏడు మండలాల పంచాయతీరాజ్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో మునుగోడులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులు ప్రతిరోజు ఉదయం 9 గంటలకు గ్రామాలకు వెళ్లి సాయంత్రం 5 గంటల వరకు విధుల్లో ఉండి ప్రజలకు అవసరమైన సేవలు అందించాలన్నారు. ప్రధానంగా మంచి నీటి సమస్య లేకుండా శ్రద్ధ తీసుకోవడంతోపాటు వారం రోజులకు ఒకమారు మురికి కాల్వలను శుభ్రం చేయించాలన్నారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలకు అర్హులను మాత్రమే ఎంపిక చేయాలని సూచించారు. నియోజకవర్గంలోని ఏడు గ్రామాలను పైలట్ ప్రాజెక్టు కింద ఎంపికచేసి వాటిని మోడల్ గ్రామాలుగా తీర్చిదిద్దాలన్నారు. అధికారులు క్షుణంగా పరిశీలించిన తర్వాత మాత్రమే ఇళ్ల నిర్మాణలకు అనుమతులు ఇవ్వాలన్నారు. బెల్టు దుకాణాలను నిషేధించిన విధంగానే ప్లాస్టిక్ వస్తువుల వాడకాన్ని కూడా దశలవారీగా నిషేధించాలని కోరారు. ఈ సమీక్ష సమావేశంలో నల్లగొండ, యాదాద్రి భువనగిరి జిల్లాల డీఎల్‌పీఓలు, నియోజకవర్గంలోని ఏడు మండలాల ఎంపీడీఓలు, పంచాయతీ కార్యదర్శులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు నారబోయిన రవిముదిరాజ్, చిలుకూరి ప్రభాకర్‌రెడ్డి, దోటి నారాయణ, ఉబ్బు వెంకటయ్య, పబ్బు రాజు, భీమనపల్లి సైదులు, పాల్వాయి చెన్నారెడ్డి, పూల వెంకటయ్య, రవీందర్ రావు తదితరులు పాల్గొన్నారు.

బాలసైదులు కుటుంబానికి పరామర్శ

కట్టంగూర్ : బీఆర్‌ఎస్ పార్టీ సోషల్ మీడియా మండల అధ్యక్షుడు కట్టంగూర్‌కు చెందిన గోగు బాలసైదులు(32) అనారోగ్యంతో గురువారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య శుక్రవారం బాలసైదులు మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతుడి కుటుంబ సభ్యులకు రూ.20వేల ఆర్థికసాయం అందజేశారు. ఆయన వెంట మాజీ జెడ్పీటీసీ తరాల బలరాములు, పోగుల నర్సింహ, పెద్ది బాలనర్సింహ, బీరెల్లి ప్రసాద్, అంతటి శ్రీను, మేడి రాములు, రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, నూక సైదులు తదితరులు ఉన్నారు.

కార్మిక చట్టాల అమలులో ప్రభుత్వాలు విఫలం

చిట్యాల: ఎన్నో పోరాటాల ఫలితంగా ఏర్పాటైన కార్మిక చట్టాలను అమలు చేయడంలో పాలక పక్షాలు విఫలమయ్యాయని సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. చిట్యాల మండలం చిన్నకాపర్తి గ్రామంలో గురువారం రాత్రి జరిగిన మేడే ఉత్సవాల్లో ఆయన పాల్గొని జెండా ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు జిట్ట నగేష్, అవిశెట్టి శంకరయ్య, తుమ్మల పద్మ, మండల నాయకులు ఐతరాజు నర్సింహ, లడే రాములు, కోనేటి రాములు, విజయ, రూపని ఇద్దయ్య, శిరసు హన్మయ్య, వీరమళ్ళ వెంకటేష్, దేశపాక సైదులు పాల్గొన్నారు.

కల్లు గీత సంఘం ఎన్నికల ప్రచారం ప్రారంభం



ఓట్లు అడుగుతున్న అభ్యర్థులు

నకిరేకల్ : కల్లు గీత పారిశ్రామిక సహకార సంఘం ఎన్నికలు ఈ నెల 5న నిర్వహించనున్న నేపథ్యంలో ఆ సంఘ నేతలు శుక్రవారం ప్రచారం ప్రారంభించారు. నకిరేకల్ కల్లు గీత పారిశ్రామిక సంఘం పరిధిలో మొత్తం 782 మంది ఓటర్లు ఉండగా వారిని కలిసి తమ ప్యానల్ వారికి ఓట్లు వేయాలని అభ్యర్థిస్తున్నారు. తమకు అవకాశం ఇస్తే నిర్మాణంలో ఉన్న గౌడ కల్యాణ మండపం పనులను ఆరు మాసాల్లో పూర్తి చేస్తామని, లేకుంటే తమ పదవులకు రాజీనామా చేస్తామని ప్రచార కరపత్రాలను ఓటర్లకు పంచుతూ ఓటు వేయాలని అభ్యర్థిస్తున్నారు. ప్రచారంలో మున్సిపల్ చైర్‌పర్సన్ చౌగోని రజితాశ్రీనివాస్‌గౌడ్, అభ్యర్థులు కొండ వెంకన్నగౌడ్, చౌగోని నాగయ్య, కొండ శ్రీను, చౌగోని వెంకన్న, తండు వెంకటేశ్వర్లు, మల్లెబోయిన దశరథ, కొండ యాదమ్మ, తలారి వీరమ్మలు పాల్గొన్నారు.

మర్రిగూడలో వడగండ్ల వర్షం

మర్రిగూడ : మండల కేంద్రంలో శుక్రవారం సాయంత్రం వడగండ్ల వర్షం కురిసింది. సమీప గ్రామాల్లో ఎక్కడా కురవకపోగా మర్రిగూడలోని ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద మబ్బులను చూసి రైతులు తమ ధాన్యాన్ని రాశులుగా చేసి పట్టాలు కప్పుకున్నారు.

శివన్నగూడ రిజర్వాయర్ పరిశీలన

మర్రిగూడ : అత్యధిక ఫ్లోరైడ్ కలిగిన మర్రిగూడ, మునుగోడు నియోజకవర్గాల్లో రిజర్వాయర్లు పూర్తయితేనే ఈ ప్రాంతంలో పంటలకు సాగు నీరు సాధ్యమవుతుందని మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్ అన్నారు. శుక్రవారం మండలంలోని శివన్నగూడ రిజర్వాయర్ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా లింగయ్యయాదవ్ మాట్లాడుతూ శివన్నగూడ, లక్ష్మపురం ప్రాజెక్టులు పూర్తయితే ఈ ప్రాంతంలోని 2లక్షల ఎకరాలకు సాగునీరు లభిస్తుందన్నారు. నిర్వాసితులకు ఆర్ అండ్ఆర్ ప్యాకేజీ అందించడంతోపాటు పునరావాసం కల్పించాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట అయోధ్య, గుండెబోయిన సత్తయ్య, శ్రీరామ్ తదితరులు ఉన్నారు.

ప్రధాని మోదీ ఫ్లెక్సీకి పాలాభిషేకం

మునుగోడు: దేశవ్యాప్తంగా చేపట్టనున్న జనగణనతోపాటు కుల గణన చేపడతామని కేంద్ర మంత్రివర్గం తీర్మానించడంపై హర్షం వ్యక్తం చేస్తూ బీజేపీ నాయకులు శుక్రవారం మునుగోడు అంబేద్కర్ చౌరస్తాలో ప్రధాని మోదీ ఫ్లెక్సీకి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మాదగోని నరేందర్‌గౌడ్, బొల్గూరి రమేష్, పందుల నర్సింహ, నీరుడు రాజారాం, ఎండీ మాజీద్, అక్కెనపల్లి సతీష్, దాం విష్ణు, పందుల యాదయ్య, పోలె వెంకటేశ్వర్లు, పిట్టల రాములు, బొజ్జ రాములు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు అభినందన

నల్లగొండ : పదో తరగతి ఫలితాల్లో నల్లగొండ మైనార్టీ బాలికల పాఠశాల వంద శాతం ఉత్తీర్ణత సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ షాహిన్ షేక్ శుక్రవారం తెలిపారు. నస్రీన్ 600 మార్కులకు 562, హసీబ 561, సమ్రీన్ 560, అరీబ 553, మోఫియా 550 మార్కులు సాధించారు. ఈ విద్యార్థులను ఇన్‌చార్జ్ అదనపు కలెక్టర్ రాజ్‌కుమార్ శుక్రవారం సన్మానించారు. కార్యక్రమంలో ఆర్‌ఎల్‌సీ విష్ణుమూర్తి, సురేష్, పహీమ్, హాశమ్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యం



ధాన్యం కుప్పల నుంచి నీటిని తీస్తున్న మహిళా రైతు

నాంపల్లి : అకాల వర్షానికి కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసి ముద్దయింది. నాంపల్లి మండల కేంద్రంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కొనుగోలు కేంద్రంలో 2 వేల క్వింటాళ్ల వరకు ధాన్యం కాంటా వేసినా లారీల కొరతతో ధాన్యం బస్తాలు ఎగుమతి కాకుండా నిలిచిపోయాయి. శుక్రవారం వర్షం కురవడంతో ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యం నీటిపాలయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతులు వారం రోజులుగా ఆందోళన చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

వర్షానికి రహదారులు జలమయం



నాంపల్లిలో ఎస్‌బీఐ ఎదుట నిలిచిన వర్షపు నీరు

నాంపల్లి : మండల కేంద్రంలో శుక్రవారం కురిసిన వర్షానికి వీధులన్నీ జలమయం అయ్యాయి. మోకాలి లోతు నీళ్లు రోడ్డుపై నిలవడంతో ప్రజలు వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. కాస్త వర్షం పడితే చాలు.. నీరు పోయే మార్గం లేక రోడ్డు మీదనే వర్షపు నీరు నిలుస్తోందని వాహనాదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డుపై గుంతల్లో పడి గతంలో పలు ప్రమాదాలు జరిగినా ఎవరూ పట్టించుకోవడం లేదని పలువురు పేర్కొంటున్నారు. మండల కేంద్రంలో పరిస్థితి ఇలా ఉంటే గ్రామాల్లో సమస్యలు ఎలా పరిష్కారమవుతాయని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. మండల కేంద్రానికి ప్రత్యేకాధికారి ఎంపీఓ ఉండి కూడా సమస్యలు తీరడం లేదని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

సోషల్ మీడియాపై రైతులకు అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న షీ టీమ్ సిబ్బంది

రామగిరి(నల్లగొండ): ప్రస్తుతం సోషల్ మీడియాలో జరుగుతున్న మోసాలపై అప్రమత్తంగా ఉండాలని నల్లగొండ షీ టీమ్ సిబ్బంది రైతులకు సూచించారు. నల్లగొండ మండలంలోని జి.చెన్నారం ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద షీ టీమ్ ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమెన్ ఏఎస్‌ఐ విజయలక్ష్మి, మాట్లాడుతూ మహిళలు, యువతులు ఆపద సమయంలో 100 నంబర్‌కు డయల్ చేయాలని సూచించారు. ఆన్‌లైన్ మోసాల బారినపడకుండా యువతను కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు



కమిషనర్ బాలయ్యను సన్మానిస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం



మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుకు స్వాగతం పలుకుతున్న వీరేశం కుటుంబ సభ్యులు

- నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం

నకిరేకల్ : విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసిన ఉద్యోగులకు తప్పక గుర్తింపు లభిస్తుందని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. శుక్రవారం నకిరేకల్ మున్సిపల్ కమిషనర్ బాలయ్య పదవీ విరమణ సభలో ఆయన మాట్లాడారు. మున్సిపల్ చైర్ పర్సన్ చౌగోని రజితాశ్రీనివాస్‌గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ చంద్రశేఖర్, ఎంఈఓ మేకల నాగయ్య, మున్సిపల్ ఏఈ గౌతం, వైస్ చైర్‌పర్సన్ మురారిశెట్టి ఉమారాణి, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

వీరేశం ఇంటికి మంత్రి తుమ్మల

నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం గృహ ప్రవేశం ఈ నెల 4న నకిరేకల్ ఏర్పాటు చేశారు. ఆయన ఆహ్వానం మేరకు హైదరాబాద్ నుంచి ఖమ్మం వెళ్తున్న రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు శుక్రవారం మధ్యాహ్నం వేముల వీరేశం నూతన గృహాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనకు వేముల వీరేశం తన కుటుంబ సమేతంగా స్వాగతం పలికార

విద్యార్థులకు ఎమ్మెల్యే సన్మానం

నార్కట్‌పల్లి : మండల కేంద్రంలోని పీవీఆర్ చేతన పాఠశాల విద్యార్థులు ఇటీవల వెలువడిన పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ఆకవరం ధీరజ్ 574 మార్కులు, నాగోజు కీర్తి 559 మార్కులు సాధించారు. శుక్రవారం విద్యార్థులను నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అభినందించి సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సి పాల్ పుచ్చకాయల వెంకట్‌రెడ్డి, డైరెక్టర్ సునీత, ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు కందాల పాపిరెడ్డి, శంభులింగారెడ్డి, మాజీ ఎంపీటీసీ పాశం శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఆశాలకు కనీస వేతనం నిర్ణయించాలి



నల్లగొండ టౌన్ : మెడికల్ ఆఫీసర్‌కు నోటీసులు అందజేస్తున్న ఆశా వర్కర్లు



నార్కట్‌పల్లి : నోటీసు అందజేస్తున్న ఆశావర్కర్లు

నల్లగొండ టౌన్: కనీస వేతనం రూ.26 వేలు నిర్ణయించాలని కోరుతూ ఈ నెల 20న కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించే సార్వత్రిక సమ్మెలో ఆశా కార్యకర్తలు పాల్గొంటారని తెలంగాణ ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు చిన్నపాక లక్ష్మీనారాయణ, సీఐటీయూ జిల్లా కార్యదర్శి దండంపల్లి సత్తయ్య తెలిపారు. శుక్రవారం ఆశా వర్కర్ల యూనియన్ ఆధ్వర్యంలో నల్లగొండ పట్టణంలోని పానగల్, మాన్యంచెల్క, లైన్‌వాడ, అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల మెడికల్ ఆఫీసర్లకు సమ్మె నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పోలె సత్యనారాయణ, ఆశా కార్యకర్తలు చింత వజ్రమ్మ, ఎర్ర సౌజన్య, సువర్ణ, ఎడవెల్లి ప్రేమలత, రేణుక, జ్యోతి, సబిత, వీరభద్రమ్మ, శోభారాణి, రాజేశ్వరి, సుధారాణి పాల్గొన్నారు.

ఆశావర్కర్ల సమ్మె నోటీస్

చండూరు : ఈ నెల 20న జరుగనున్న దేశవ్యాప్త సమ్మెలో భాగంగా తాము కూడా సమ్మెలో పాల్గొంటున్నట్లు ఆశా వర్కర్లు స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ మాన రాజుకు సమ్మె నోటీస్ ఇచ్చారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కన్వీనర్ ధనుంజయ మాట్లాడుతూ ఆశా వర్కర్లకు రూ.18 వేల వేతనం ఇవ్వాలని, పీఎఫ్, ఈఎస్‌ఐ సదుపాయాలు, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆశా వర్కర్ల సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు కట్ట పద్మ, నీల జ్యోతి, లలిత, జయమ్మ, ధనమ్మ, సఫియా, సంతోష, రాధ, రేణుక, వెంకటమ్మ, సుమలత, భవాని, దుర్గా, జ్యో తి, వరలక్ష్మీ, జయమ్మ, నాగమణి, భాగ్యమ్మ, పరమేశ్వరి, స్వరూప, పద్మ తదితరులు పాల్గొన్నారు.

నార్కట్‌పల్లి : సీఐటీయూ ఆధ్వర్యంలో ఈ నెల 20న దేశవ్యాప్తంగా జరిగే సార్వత్రిక సమ్మెలో పాల్గొనాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు చింతపల్లి బయన్న కోరారు. ఆశావర్కర్లతో కలిసి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ విజయకుమార్‌కు శుక్రవారం సమ్మె నోటీసు అందజేసి మాట్లాడారు. కార్యక్రమంలో ఆశావర్కర్లు తుమ్మల నాగలక్ష్మి, కరుణ, భాగ్య, ఆదిమల్ల పద్మ, చిక్కుల పద్మ, మంగమ్మ, వెంకటమ్మ తదితరులు ఉన్నారు.

దాబాల తనిఖీ

కట్టంగూర్ : హైవే పక్కన నిర్వహిస్తున్న దాబాలు, రెస్టారెంట్‌ల యాజమాన్యం నాణ్యతా ప్రమాణాలు పాటించాలని డివిజనల్ పంచాయతీ అధికారి(డీఎల్‌పీఓ) వెంకటేశ్వర్లు సూచించారు. శుక్రవారం కట్టంగూర్ గ్రామ శివారులో హైవే పక్కనే ఉన్న దాబాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దాబాల పరిసరాలు, వంట పాత్రలు పరిశుభ్రంగా ఉండే విధంగా చూసుకోవాలన్నారు. కిరాణం సామగ్రి, కూరగాయలు తాజాగా ఉన్నవాటినే ఉపయోగించాలన్నారు. నాణ్యతా ప్రమాణాలు పాటించకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. హైవే పక్కన వాహనాలు నిలువకుండా యాజమాన్యం తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట ఎంపీఓ చలపతి, పంచాయతీ కార్యదర్శి అశోక్ ఉన్నారు.

వేసవి శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

కేతేపల్లి : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించే వేసవి శిక్షణ శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ ఆకవరం రాజేంద్రప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేతేపల్లి హైస్కూల్‌లో వేసవి శిక్షణ ప్రారంభించడానికి ప్రభుత్వం నుంచి అనుమతి లభించదని పేర్కొన్నారు. మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించే విద్యార్థులకు ప్రతిరోజు ఉదయం 7 గంటల నుంచి 9 గంటల వరకు డ్రాయింగ్, నృత్యంతోపాటు సాంస్కృతిక కార్యక్రమాలు నేర్పిస్తారని తెలిపారు.

బొడ్డు సత్తయ్య విగ్రహావిష్కరణ



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

చండూరు : బడుగు బలహీన వర్గాలు, అట్టడుగు వర్గాలకు సాయం చేసిన వ్యక్తి బొడ్డు సత్తయ్య అని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. శుక్రవారం చండూరులోని గుండ్రపల్లి సర్కిల్‌లో బొడ్డు సత్తయ్య విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాజ్యసభ మాజీ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్ మాట్లాడుతూ బీసీలంతా ఏకం కావాలని, రాజ్యాధికారం కోసం ఐక్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా, కాసం వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు జక్కలి అయిలయ్యయాదవ్, బూడిద లింగయ్యయాదవ్, దోటి వెంకటేష్‌యాదవ్, అచ్చిన శ్రీను, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రామలింగయ్య, బొడ్డు మురళి తదితరులు పాల్గొన్నారు.

నేత్రాల సేకరణ

నల్లగొండ టౌన్: పట్టణానికి చెందిన పెండోటి బ్రాహ్మణచారి (96) మరణించారు. విషయం తెలుసుకున్న లయన్స్ క్లబ్ ఆఫ్ నల్లగొండ వారు మృతుడి కుటుంబ సభ్యుల అనుమతితో డాక్టర్ పుల్లారావు సహకారంతో శుక్రవారం బ్రాహ్మణచారి నేత్రాలను సేకరించారు. ఈ సందర్భంగా క్లబ్ సభ్యుడు కొల్లోజు చంద్రశేఖర్ మృతుడి కుటుంబ సభ్యులైన పిచ్చమ్మ, రాము, నగేష్, భరతచారి, విజయలకు కృతజ్ఞతలు తెలిపారు.

బస్టాండ్‌లో కారు బీభత్సం



ప్రమాదానికి కారణమైన కారు

రామగిరి(నల్లగొండ): నల్లగొండ ఆర్టీసీ బస్టాండ్‌లో కారు బీభత్సం సృష్టించింది. శుక్రవారం రాత్రి సమయంలో కారు ప్రయాణికులను ఎక్కించుకునేందుకు బస్టాండ్ లోపలికి వచ్చింది. డ్యూటీలో ఉన్న స్టేషన్ మేనేజర్‌గా బోనగిరి నరేందర్ ఆ కారు అడ్డుకునేందుకు ప్రయత్నించాడు. ఈ క్రమంలో డ్రైవర్ కారును ఆపకుండా వేగంగా వెళ్లడంతో నరేందర్ రోడ్డుపై పడిపోయాడు. ఈ ప్రమాదంలో అతడికి తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడే ఉన్న ప్రయాణికులు కారును అడ్డుకునేందుకు ప్రయత్నించగా డ్రైవర్ పారిపోయాడు. ఈమేరకు ఆర్టీసీ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

నాంపల్లి : విద్యుదాఘాతానికి గురై గేదె మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ సమీపంలో జరిగింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన పల్లా కోటిరెడ్డి తన వ్యవసాయ పొలం నుంచి గేదెలను తోలుకుని ఇంటికి వస్తున్న క్రమంలో ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి విద్యుదాఘాతానికి గురై ఒక గేదె మృతి చెందింది. దీంతో రూ.లక్ష వరకు నష్టం వాటిల్లిందని బాధిత రైతు వాపోయాడు.

బహుమతులు అందజేత

చిట్యాల: మండలంలోని వెలిమినేడు గ్రామంలో మల్లం యాదయ్య స్మారకార్థం డీవైఎఫ్‌ఐ, ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ఇటీవల వాలీబాల్ పోటీలు నిర్వహించారు. విజేతలకు ఆ గ్రామంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో నిర్వాహకులు మల్లం స్వామి, మహేష్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ అర్రూరి శ్రీనివాస్, కూనురు గణేశ్, అర్రూరి ప్రణీత్, దేశబోయిన నర్సింహ, దేశబోయిన లింగస్వామి, నాతి కిరణ్, గోలి సాయికిరణ్, ఆడెపు రమేష్, సుర్కంటి బుచ్చిరెడ్డి పాల్గొన్నారు.